క్లుప్తంగా

ఆలయంలో హుండీ చోరీ

బంగారుపాళెం: మండలంలోని పాలేరులో శుక్రవారం రాత్రి ఆంజనేయస్వామి గుడిలో దుండగులు హుండీ పగులగొట్టి అందులోని నగదు అపహరించుకుపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. పాలేరు–మోతకుంట రహదారి పక్కన ఆంజనేయస్వామి గుడిలో హుండీ ఏర్పాటు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు హుండీ పగులగొట్టి అందులో నగదు తస్కరించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని శనివారం ఉదయం గుర్తించి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారన్నారు.

తడి, పొడి వ్యర్థాలను వేరుగా తరలించాలి



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ జె అరుణ

చిత్తూరు అర్బన్: నగరంలో తడి, పొడి వ్యర్థాలను వేరుగానే సేకరించాలని, వేరుగానే వాహనాల్లో తరలించాలని నగర కమిషనర్ అరుణ పారిశుద్ధ్య కార్మికులు, వాహనాల డ్రైవర్లను ఆదేశించారు. శనివారం ఉదయం కమిషనర్ స్థానిక రీడ్స్‌పేట, షర్మన్ పాఠశాల వద్ద పారిశుద్ధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యర్థాలను తరలిస్తున్న నగరపాలక వాహనాలను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. వాహనాల్లో వ్యర్థాలను వేర్వేరుగానే తరలించాలని సూచించారు. ప్రధాన రహదారులపై ఎక్కడా వ్యర్థాల కుప్పలు ఉండరాదన్నారు. రోడ్లు శుభ్రత పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

మజ్జిగ పంపిణీ ప్రారంభం



మజ్జిగ పంపిణీ ప్రారంభిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్

చిత్తూరు రూరల్: వేసవి దృష్ట్యా దాత పార్థసారథి నాయుడు చిత్తూరు నగరంలోని చౌడేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద శనివారం ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీన్ని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కరుణ కుమార్ ప్రారంభించారు. వేసవికాలం పూర్తయ్యేంత వరకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేస్తానని దాత పేర్కొన్నారు.

శ్మశాన వాటిక సమస్య పరిష్కారం



సరకల్లులో భూసమస్యపై ఆరా తీస్తున్న చిత్తూరు ఆర్డీఓ రేణుక

తవణంపల్లె: మండలంలోని సిద్దంపల్లె ఎస్సీల శ్మశాన సమస్య పరిష్కరించినట్లు చిత్తూరు ఆర్డీఓ రేణుక తెలిపారు. డివిజనల్ ఎస్సీ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ప్రస్తావించిన సమస్యలను శనివారం చిత్తూరు ఆర్డీఓ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండలంలోని సిద్దంపల్లె ఎస్సీలతో మాట్లాడి కుంట దగ్గర 0.50 సెంట్ల భూమిని శ్మశానానికి కేటాయిస్తున్నట్లు వివరించారు. సరకల్లులో గోపాల్ భూ సమస్యను పరిశీలించారు. కోర్టులో కేసు జరుగుతున్నందున తర్వాత పరిష్కరిస్తామని బాధితుడికి హామీ ఇచ్చారు. మాధవరంలో రోడ్డు ఆక్రమణను పరిశీలించారు. రోడ్డులో అక్రమంగా నిర్మించిన సిమెంటు దిమ్మను స్వచ్ఛందంగా తొలగించాలని లేకుంటే, జేసీబీతో తొలగించాలని తహసీల్దార్ సుశీలమ్మను ఆదేశించారు. ఆర్డీఓతో పాటు తహసీల్దార్ సుశీలమ్మ, భూరీసర్వే డిటీ వెంకటరమణ, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

వేరుశనగలో తెగుళ్ల నివారణపై అవగాహన



పదమాలపేట: వేరుశనగ పంటకు సోకే తెగుళ్లపై రైతులకు రాస్ కృషి విజ్ఞాన్ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని పత్తిపుత్తూరు, చింతకాల్వ గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాసులు మాట్లాడుతూ నిత్య హరిత, కదిరి లేపాక్షి, ధీరజ్ రకం విత్తనకాయలు సాగు చేయడం వల్ల నీటి ఎద్దడిని, ప్రధానంగా పురుగు తెగుళ్లను తట్టుకుంటాయని తెలిపారు. రబీ సీజన్‌లో హెక్టారుకు 35 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. రైతులు ఈ రకం పంటలు సాగు చేయడం చాలా మంచిదన్నారు. పంట దిగుబడి వచ్చిన తరువాత వాటిని తోటి రైతులు విత్తనాలుగా ఉపయోగించుకోవచ్చని తెలిపారు. అనంతరం రైతులు సాగు చేసిన పంటను వ్యవ సాయ పొలాల్లో సందర్శించారు. అదేవిధంగా నువ్వులు పంటకు వచ్చే తెగుళ్లు, సమస్యలను రైతులకు వివరించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ దివ్య, రాము కుమార్, రైతులు పాల్గొన్నారు.

కనుల పండువగా రథోత్సవం



గరుడ వాహనంపై ఊరేగుతున్న కోదండరాముడు





చిత్తూరు: రథోత్సవంలో భక్తులు, నిర్వాహకులు, గుడిపాల: సీతారాముల కల్యాణోత్సవం

చిత్తూరు రూరల్: పంగుణి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని చిత్తూరు నగరంలోని శ్రీ అగస్తీశ్వర స్వామి ఆలయంలో శనివారం రథోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. విశేష పూజల అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. రథోత్సవంలో స్వామివారిని కొలువుదీర్చి మేళతాళాలతో నగరవీధుల్లో కొలువుదీర్చారు. భక్తులు అడగడుగునా కర్పూర హారతులు, పసుపు పళ్లెంతో హారతులు పట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణం

గుడిపాల: మండలంలోని గొల్లపల్లెలో శనివారం భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా గొల్లపల్లెకు చెందిన ధనలక్ష్మి, సుబ్రమణ్యం దంపతుల ఆధ్వర్యంలో వేదపండితుల మధ్య కోలాహలంగా కల్యాణోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం వచ్చిన భక్తులందరికీ అన్నదానం చేశారు. అనంతరం హరికథను గ్రామస్తులు ఏర్పాటు చేశారు.

గరుడ వాహనంపై రాముడి విహారం

చిత్తూరు రూరల్: నగరంలోని శ్రీకోదండరామ స్వామి ఆలయంలో శనివారం బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామిని సుప్రభాత సేవలో మేల్కొలిపి అభిషేక పూజలు చేయించారు. ప్రత్యేకంగా అలంకరించి అభిషేక పూజలు చేశారు. తదనంతరం ఉత్సవమూర్తిని గరుడ సేవలో కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. పయ్యాళిసేవ, గోపురదర్శన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. రాత్రి హనుమంత వాహనంపై స్వామి వారిని ఊరేగిస్తూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు నీరాజనం పట్టి తరించారు. కార్యక్రమంలో చైర్మన్ సకల వెంకటేష్‌గుప్తా, అర్చకులు వేణుగోపాల్, సభ్యులు రాజా, హేమాద్రి, మాధవి, దుర్గాదేవి, ఈశ్వరి పాల్గొన్నారు.

తేనెబండలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారుకు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



అక్క చెల్లెమ్మలకే సంక్షేమ పథకాలు

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలన్నీ అక్క, చెల్లెమ్మల పేరుతోనే అందిస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. నగరంలోని తేనెబండలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గడపగడపకూ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దేశంలోనే ఏ రాష్ట్రంలోనూ అమలు కాని సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. టీడీపీ హయాంలో బీసీలకు ఏ పథకాలు వచ్చినా ఆ పార్టీ కార్యకర్తలే స్వాహా చేసేవారని విమర్శించారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు ప్రాధాన్యత ఇస్తున్న విషయం అందరికీ తెలుసన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తానని నమ్మించి గద్దెనెక్కి మహిళలను వంచించారని చెప్పారు. ఎన్నికలకు ముందు పసుపు, కుంకుమ అంటూ మహిళలను దగా చేశారన్నారు. జగనన్న ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతిహామీని నెరవేర్చారన్నారు. మరే రాష్ట్రంలో మునుపెన్నడూ అమలు చేయని వినూత్న పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి చేకూరిన లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో కమిషనర్ అరుణ, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, డిప్యూటీ మేయర్, రాజేష్‌కుమార్‌రెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్, టౌన్‌బ్యాంకు చైర్మన్ రాంగణేష్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు లీనారెడ్డి, నాయకులు త్రిమూర్తి, కృష్ణారెడ్డి, ప్రేమ్, సీతాపతి, రెడ్డెప్ప, చాంద్‌బాషా పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



ప్రజావేదికలో మాట్లాడుతున్న డ్వామా పీడీ గంగాభవాని

తవణంపల్లె: ఉపాధి కూలీల సంఖ్య పెంచి, లక్ష్యాన్ని అధిగమించాలని డ్వామా పీడీ గంగాభవాని ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఉపాధి పనుల సామాజిక తనిఖీపై ప్రజావేదిక నిర్వహించారు. ప్రజావేదికలో మండలంలోని 32 పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీలో గుర్తించిన సమస్యలను డీఆర్‌పీలు చదివి వినిపించారు. మండలంలో 2021 ఏప్రిల్ 1 నుంచి 2022 మార్చి 31వ తేదీ వరకు ఉపాధి పథకం కింద 1,040 పనులకు రూ.3,39,33,868 బిల్లులు చెల్లించారు. పంచాయతీ రాజ్ కింద 62 పనులకు రూ.2,83,13,844 వ్యయం చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ కింద 3 పనులకు రూ.3,97,116, అటవీ పరిధిలో 3 పనులకు రూ.3,43,413, ఎస్‌ఎస్‌ఏ కింద రెండు పనులకు రూ.2,00,237 వ్యయం చేశారు. ఈ పనులకు సామాజిక తనిఖీ నిర్వహించారు. డ్వామా పీడీ మాట్లాడుతూ మండలంలో 8 పంచాయతీల్లో రికార్డులు సక్రమంగా లేకపోవడం, చెట్లు చనిపోవడం వంటి పలు సమస్యలు ప్రజా వేదికలో వచ్చినట్లు వివరించారు. క్షేత్రస్థాయి సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బంది నుంచి రూ.20,940 రికవరీ చేయాలని, రూ.3800 అపరాధం విధించినట్లు వివరించారు. ప్రజావేదికలో ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, డీవీఓ భాగ్యలక్ష్మి, ఏపీడీ సుబ్రమణ్యం, ఏపీఓ లలిత, ఎస్ఆర్‌పీ అచ్యుతరావ్, ఉపాధి సిబ్బంది, అధికారులు, పంచాయతీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్ష కేంద్రాల పరిశీలన

పూతలపట్టు: నియోజకవర్గంలోని అన్ని మండలాల అధికారులు ఆయా పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. మండలంలోని జెడ్పీ హైస్కూల్లో పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని ఎంపీడీఓ గౌరి, తహసీల్దార్ విజయభాస్కర్, ఎస్ఐ హరిప్రసాద్ పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు సకల సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని హెచ్ఎంను ఆదేశించారు. అత్యవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచాలని తెలిపారు.

144 సెక్షన్ అమలు

యాదమరి: యాదమరిలో పదో తరగతి పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ చిట్టిబాబు, ఎస్ఐ సుమన్ పరిశీలించారు. మండల పరిధిలో మొత్తం పది కేంద్రాల్లో 381మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. కేంద్రాల్లో విద్యుత్ సదుపాయం ఉందా లేదా అని తనిఖీ చేశారు. పరీక్ష సమయంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలియజేశారు.

అన్ని వసతులు ఉండాలి

బంగారుపాళెం: పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని ఎంపీడీఓ హరిప్రసాద్ సూచించారు. మండల కేంద్రంలోని పరీక్ష కేంద్రాలను శనివారం ఎంఈఓ నాగేశ్వర్ రావుతో కలసి తనిఖీ చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ, సోమవారం నుంచి 10 వతరగతి విద్యార్థులకు పరీక్షలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. తాగునీరు, డెస్కులు, విద్యుత్, మెడికల్ క్యాంప్ వంటి అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఎంఈఓ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ, బంగారుపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, సెయింట్ మేరీ ఉన్నత పాఠశాల, గుండ్లకట్టమంచి జెడ్పీ హైస్కూల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కేంద్రాల్లో మొత్తం 838 మంది పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు.

ఏర్పాట్లు పూర్తి

తవణంపల్లె: మండల కేంద్రంలోని హైస్కూల్లో శనివారం సాయంత్రం పరీక్ష కేంద్రాన్ని ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, ఎంఈఓ శంకరయ్య తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలో విద్యుత్ సరఫరా, తాగునీరు వంటి వసతులను పరిశీలించారు. విద్యార్థులు పరీక్ష రాయడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.



పూతలపట్టు: పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు



బంగారుపాళెం: గుండ్లకట్టమంచి జెడ్పీహైస్కూల్లో వసతులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ



యాదమరి: పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్ఐ

గ్రామాల్లోనూ క్రికెట్ బెట్టింగ్



గుడిపాల: ఐపీఎల్ క్రికెట్ నేపథ్యంలో నియోజకవర్గంలో గిరింపేట, కొంగారెడ్డిపల్లె, సంతపేట, రామ్‌నగర్‌కాలనీ, ఎస్టేట్‌తోపాటు గ్రామాల్లోనూ క్రికెట్ బెట్టింగ్ జోరుగా సాగుతోంది. వినోదం కోసం నిర్వహించే క్రికెట్ పోటీలు కొందరు జూదరులకు కల్పతరువుగా మారింది. వ్యాపారం సీజన్‌లో ఎలాగో క్రికెట్ బెట్టింగ్ కాసేవారికి ఈ ఐపీఎల్ కూడా ఒకసీజన్‌లా తయారైంది. గతంలోలా జనాలందరూ ఒకచోట కూర్చొని మ్యాచ్ చూస్తూ బెట్టింగ్ కాస్తూ రూ.లక్షల్లో చేతులు మారే రోజులు పోయాయి. టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కడంతో స్మార్ట్‌ఫోన్‌లోనే బెట్టింగ్ కాసేలా కొన్ని యాప్‌లు వచ్చాయి. దీంతో జూదరులు యాప్‌లతో రూ.లక్షల్లో బెట్టింగ్ కాస్తున్నారు. రోజుకు ఒక మ్యాచ్. శని, ఆదివారాల్లో రెండు రెండు మ్యాచ్‌లు నిర్వహిస్తున్న దృష్ట్యా జూదరులకు శని, ఆదివారాలు ఓ పండుగలా తయారైంది. ఫోన్ పే, గూగుల్ పే ద్వారా నగదు జమ చేసుకుంటూ ప్రశాంతంగా ఇంట్లోనే స్మార్ట్‌ఫోన్‌లో బెట్టింగ్ కాస్తున్నారు. క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న వారితో యువతే ఎక్కువమంది ఉన్నారు. ప్రతి ఒక్కరికీ స్మార్ట్‌ఫోన్ ఉండడంతో అందులో బెట్టింగ్ యాప్‌లు డౌన్‌లోడ్ చేసి దర్జాగా బెట్టింగ్ కడుతున్నారు. శని, ఆదివారాల్లో జరిగే మ్యాచ్‌ల్లో రూ.లక్షల్లో బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. జూదరులను పట్టుకునేందుకు పోలీసులకు కష్టంగా తయారైంది. ఏది ఏమైనా వినోదం కోసం నిర్వహించే ఐపీఎల్ మ్యాచ్ యువతను మరింత చెడుదారుల్లోకి నెట్టేస్తోందని కొందరు ప్రముఖులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

31 నుంచి ఆరంభం

మార్చి 31 నుంచి మొదలైన ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు ఉన్నాయి. అప్పటివరకు యువత బెట్టింగ్‌లో మునగనుంది. ప్రతి బాల్‌కు కూడా బెట్టింగ్‌లను కడుతున్నారు. క్రికెట్ పిచ్ ఉన్న ప్రతి ఒక్కరూ ఇదే తరహాలో ఉన్నారు. కొంతమంది ఉద్యోగులు కార్యాలయాల్లో కూర్చొని మరుసటి రోజు జరిగే మ్యాచ్‌లపై ముందుగానే బెట్టింగ్‌లు కట్టుకుంటున్నారు. ఇందుకోసం ముందస్తుగా కొంత నగదును అడ్వాన్స్ రూపంలో చెల్లిస్తున్నారు. కార్యాలయాల్లో పనులు మాని ఐపీఎల్‌పై ప్రత్యేకంగా శ్రద్ధ కనబరుస్తున్నారు. టీ దుకాణాలు, హోటల్‌ల వద్ద కూడా ఐపీఎల్ మ్యాచ్‌ల పైనే మాటలు జరుగుతున్నాయి.

వినాయకుని సేవలో ప్రముఖులు



ఎమ్మెల్యే శంకర్‌నారాయణకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఈఓ వెంకటేశు



జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుకు తీర్థ ప్రసాదాలు అందిస్తున్న ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. జిల్లా జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, రాష్ట్ర మాజీ మంత్రి పెనుగొండ ఎమ్మెల్యే శంకర్ నారాయణ స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ ఈఓ వెంకటేశు, ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు, బాబు పాల్గొన్నారు.

మండలంలో తేలికపాటి వర్షం

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలంలో శనివారం ఉదయం తేలికపాటి వర్షం కురిసింది. అరగంట పాటు కురిసిన వర్షానికి రోడ్లంతా కాస్త జలమయంగా మారాయి. భరించలేని ఉక్కపోతతో అల్లాడుతున్న జనానికి ఈ వర్షం కాస్త ఉపశమనమిచ్చింది. ఆపై వాతారణం చల్లబడింది.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



గుడిపాల: సీమంతం కార్యక్రమంలో సీడీపీఓ శ్యామ్ సుగుణకుమారి

గుడిపాల: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సీడీపీఓ శ్యామ్ సుగుణ కుమారి అన్నారు. అంగన్‌వాడీల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, శిశువులు క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా శనివారం రాసనపల్లె, చీలాపల్లె, మొగరాళ్లపల్లె, పేయనపల్లెకు సంబంధించి పౌష్టికాహార పక్షోత్సవాలను నిర్వహించారు. పోషకాహార పదార్థాలతో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో పోషకాహారం తీసుకునేవారితోపాటు, ఇంటికి తీసుకెళ్లే వారు సక్రమంగా తినేలా పర్యవేక్షించాలని ఆమె ఆదేశించారు. ఆరేళ్ల పిల్లల ఎత్తు, బరువు పరిశీలించాలని చెప్పారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేయించాలన్నారు. పోషకాహారం అందించి రక్తహీనత లేకుండా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు సామూహికం సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనురాధ, లావణ్య, వైద్య సిబ్బంది అన్నపూర్ణ, రిజ్వానా, అంగన్‌వాడీ టీచర్లు బుజ్జి, మల్లిక, సోనియా, లక్ష్మి, బిందు, వనిత, సుధ, శైలజ, మేఘన, స్వాతి, గౌతమితోపాటు మహిళా పోలీసులు ప్రియ, యువశ్రీ పాల్గొన్నారు.

గుండ్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: మండలంలోని గుండ్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. శనివారం స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత 104 వైద్య శిబిరంలో 80 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధి గ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇంటి వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని వైద్య సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలి

తవణంపల్లె: గర్భిణులు రక్తహీనత రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని గాజులపల్లె, గోవిందరెడ్డిపల్లెలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు 95 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, సూచనలు, సలహాలు ఇచ్చారు. గర్భవతులు మంచి పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో ప్రజల ఇంటి వద్దకే వైద్యం వస్తోందని బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి రష్మిత అన్నారు. మండలంలోని డిబి పల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. బీపీ, చక్కెరవ్యాధి గ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇందులో 105మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఇంటి వద్దనే ఆరోగ్య సేవలను అందించారు. వైద్య సిబ్బంది భాస్కర్, శ్రీలక్ష్మి, యమున పాల్గొన్నారు.







గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో డాక్టర్ రక్షిత, ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి పూర్ణలత, తవణంపల్లె: గోవిందరెడ్డిపల్లెలో గర్భిణులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

కాలనీకి తీరిన దాహార్తి



మహిళకు బిందెను అందిస్తున్న జగదీశ్వర్ రెడ్డి

పూతలపట్టు: మండలంలోని పక్కాలగుట్ట కాలనీ దాహార్తి తీర్చినట్లు పారిశ్రామిక వేత్త జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం తాగునీటి కొళాయిలను ప్రారంభించారు. ఆయన తన సోదరుడు దివంగత నేత సుబ్బారెడ్డి కాలనీ ప్రజలకు ఇచ్చిన మాట నెరవేరిందన్నారు. పనులకు సుమారు రూ.2లక్షలు ఖర్చు అయ్యినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయభాస్కర్, సర్పంచ్ మాసిలామణి, లోకనాథరెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ ఖాదర్‌వలీ పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి పట్టా



పట్టా అందుకుంటున్న రుషీశ్వర్ రెడ్డి

ఐరాల: మండలంలోని పొలకల పంచాయతీ గుడ్డిపల్లెకు చెందిన టి.చంద్రశేఖర్‌రెడ్డి కుమారుడు ఎంబీబీఎస్ విద్యార్థి టి.రుషీశ్వర్‌రెడ్డి డాక్టర్ పట్టా పొందారు. ఇతను 2017వ సంవత్సరం నీట్ ఎగ్జామ్‌లో స్టేట్‌లో 136వ ర్యాంక్ సాధించి, ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే ప్రథమస్థానంలో నిలిచారు. ప్రస్తుతం ఎంబీబీఎస్ ప్రథమ స్థానంలో ఉత్తీర్ణుడయ్యారు. ఈ మేరకు రుషీశ్వర్‌రెడ్డి శుక్రవారం తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజ్ జీఎంహెచ్ఓ సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథి చేతుల మీదుగా కాన్వకేషన్ పట్టా అందుకున్నారు.